విలేకరులు కావలెను

పవర్ జాతీయ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.

ఆసక్తి కలవారు, అనుభవం కలవారుసంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాలవారీగా విలేకరులు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశం ఉంటుంది

ఇంచార్జ్ : పొన్నం మహేష్‌గౌడ్

90004 88885



Dr.PRK

# పవర్

పోరాడితే పోయెదేమి లేదు బానిస సంకెళ్ళు తప్ప



రామకృష్ణ హాస్పిటల్స్

పక్షవాతం, డిస్క్ సమస్యలు, నడుమునొప్పి, మెడ నొప్పులకు పూర్తి చికిత్స కలదు.

నిరుపేదలకు ఉచిత వైద్యం

రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్

విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ

సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 331 | బుధవారం 2 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


# హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం

- హైడ్రా వర్సెస్ గణేశ్ ఉత్సవ సమితి
- హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనంపై కొత్త వివాదం
- తాము అభివృద్ధి చేసిన చెరువుల్లో నిమజ్జనం కుదరదన్న హైడ్రా
- అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదన్న గణేశ్ ఉత్సవ సమితి
- యథావిధిగా అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం చేస్తామని స్పష్టీకరణ



హైదరాబాద్, పవర్ న్యూస్

హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో విగ్రహాల నిమజ్జనంపై మరోసారి వివాదం నెలకొంది. తాము పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని హైడ్రా స్పష్టం చేయడంతో ఈ వివాదం రాజుకుంది. అయితే, ఈ నిర్ణయాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. హైడ్రా ప్రకటనపై గణేశ్ ఉత్సవ సమితి ఘాటుగా స్పందించింది. విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదని సమితి స్పష్టం చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూడటం తగదని, ప్రతి ఏటా మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం నిర్వహించి తీరుతామని ఉద్ఘాటించింది. హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఉత్సవ సమితి పేర్కొంది. విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వాదించింది. ఇరుపక్షాల మధ్య నెలకొన్న ఈ భిన్న వాదనలతో ప్రస్తుతం నిమజ్జనంపై గందరగోళం నెలకొంది.



# కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ

మంత్రివర్గ విస్తరణపై చర్చ?

ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ

రాష్ట్ర రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య కీలక చర్చలు

మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై ప్రధానంగా మంతనాలు

న్యూఢిల్లీ, పవర్ న్యూస్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పాలనకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని సంతరించుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ భేటీలో ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణతో పాటు, నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆమోదం కోసం ఆయన వేణుగోపాల్‌తో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పార్టీలో క్రమశిక్షణకు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ సంఘం జారీ చేసిన షోకాజ్ నోటీసులు, వారు సమర్పించిన వివరణలపై ఈ భేటీలో చర్చించినట్లు తెలుస్తోంది. వీరిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి అధిష్ఠానం అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# ఒకే ఇంట్లో 24 మృతదేహాలు

నేపాల్ వరదలు..

1,003కు పెరిగిన మృతుల సంఖ్య

ఇంకా 4వేల మంది గల్లంతు!

నేపాల్ ఆకస్మిక వరదలు

12వేల మందిని రక్షించిన సహాయక బృందాలు

ఇంకా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



న్యూఢిల్లీ, పవర్ న్యూస్

నేపాల్ ఆకస్మిక వరదల్లో మరణించిన వారి సంఖ్య మంగళవారం నాటికి 1000 దాటగా, మరో 4000 మంది గల్లంతయ్యారు. ఇప్పటికీ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతూనే ఉందని అధికారులు తెలిపారు. "నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా మరణించినవారి సంఖ్య మంగళవారం నాటికి 1,003కు చేరింది. కాగా, దేశంలోని ఎనిమిది జిల్లాల్లో భద్రతా దళాలు మరిన్ని మృతదేహాలను వెలికితీశాయి. సుమారు 4000 మంది గల్లంతు అయ్యారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 12వేల మందిని రక్షించాం" అని నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ) మంగళవారం తెలిపింది.

నేపాల్-టిబెట్ సరిహద్దు సమీపంలో మంచు, రాళ్లు విరిగిపడడం లేదా హిమపాతం వల్ల ఆకస్మిక వరదలు సంభవించినట్లు భావిస్తున్నారు. ఆగస్టు 26న సంభవించిన ఈ ఆకస్మిక వరదలు ఉత్తర, మధ్య నేపాల్‌లోని గ్రామాలను, పట్టణాలను అతలాకుతలం చేశాయి. హిమాలయ సరిహద్దు ప్రాంతం నుంచి దక్షిణ దిశగా ప్రవహించే భోటెకోశి నది వరద నీటిని దిగువకు తీసుకెళ్లింది. దీని ఈ భారీ వరద ధాటికి ఆ మార్గంలోని ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు అన్నీ కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ తెలిపిన వివరాల ప్రకారం, నేపాల్‌లోని చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 321 మృతదేహాలు లభించాయి. ఆ తర్వాత నవల్‌పరాసి ఈస్ట్ జిల్లాలో 216, నవల్ పరాసి వెస్ట్- 170, నువాకోట్ -95, గోర్ఖా -65, ధాడింగ్- 57, ..మిగతా 2లో

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

## దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధి

2

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు



# కవితకు వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్

2

- కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి
- కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి
- కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా

# రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై
- స్టే ఎత్తివేసిన హైకోర్టు
- తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు
- సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం




హైదరాబాద్, పవర్ న్యూస్

తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ..మిగతా 2లో

# హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్..

హైదరాబాద్, పవర్ న్యూస్



హైదరాబాద్ నగర శివారు కొంపల్లిలో భారీగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ.19 లక్షల విలువైన 1.9 కిలోల అల్ప్రాజోలం డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడు మాజీ ఎక్సైజ్ కానిస్టేబుల్ కావడం గమనార్హం. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంపల్లి జయభేరి పార్క్ సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, ఆ ప్రాంతంలో నిఘా పెట్టి నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి అల్ప్రాజోలంతో పాటు రూ.40,000 నగదు, ఒక కారు, ఒక బైక్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

# హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు భారీ ఊరట

- శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్
- సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్
- విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

2



# కిడ్నాప్ కేసును నీరుగారుస్తున్న ఆత్మకూర్ ఎస్ఐ తిరుపతి..

## తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీకి బాధితుడి విజ్ఞప్తి

(ఆత్మకూర్ -- పవర్):

ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో న్యాయం మూలపడిందని, స్థానిక ఎస్ఐ తిరుపతి మరియు సిబ్బంది బాధితులను వదిలేసి నిందితులకు కొమ్ముకాస్తూ, వరుస దాడి కేసులను పక్కదారి పట్టిస్తున్నారని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వీడియోలు డిలీట్.. పెన్ డ్రైవ్, వైద్య నివేదికలు మాయం: 2025 జులై 12న జరిగిన ఘోరమైన కిడ్నాప్ ఘటనలో ముగ్గురిపై దారుణంగా దాడి చేశారు. అందులో బాధితురాలు నోరు మూతపడి, గాయాల తీవ్రత వల్ల 10 రోజుల పాటు మాట్లాడలేని స్థితికి చేరుకోగా, మిగతా వారికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. దాడి జరిగిన రోజే పోలీస్ కానిస్టేబుల్ తన టాబ్‌లో రికార్డ్ చేసిన ఆధారాల వీడియోలను కావాలనే డిలీట్ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. కేసులో అత్యంత కీలకమైన సాక్ష్యాలు ఉన్న పెన్ డ్రైవ్‌ను సైతం పోలీసులు దాచిపెట్టారు. అనంతరం బాధితులు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది, దానికి సంబంధించిన అసలు వైద్య నివేదికలు, గుర్తింపు కార్డు ప్రతులు, ఫోటోలను స్టేషన్ కానిస్టేబుల్‌కు అందజేశారు. కానీ, 13 నెలలు గడిచినా ఆ నివేదికలను కోర్టుకు సమర్పించకుండా దాచిపెట్టారు. “మళ్లీ కొత్త నివేదికలు తెస్తేనే కేసులో యాడ్ చేస్తాం” అంటూ కాలయాపన చేస్తూ నిందితులను రక్షించే కుట్ర చేస్తున్నారని వాపోతున్నారు.నకిలీ ఇన్‌స్టాగ్రామ్ మెసేజ్‌ల కుట్ర.. సైబర్ క్రైమ్ దర్యాప్తు శూన్యం: కేసును మరింత నీరుగార్చి నిందితులకు అండగా నిలిచేందుకు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ డ్రామా మెసేజ్‌లను సృష్టించి కేసు ప్రాధాన్యతను తగ్గించేందుకు పోలీసులు కుట్ర పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అసలు నిజానిజాలు తేల్చాలని, సైబర్ క్రైమ్ విభాగానికి పంపి పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించాలని గడిచిన 13 నెలలుగా వేడుకుంటున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.కోర్టు ఉత్తర్వులు బేఖాతరు.. కోర్టు కానిస్టేబుల్ మోసం: కేసు విచారణకు రాగా, సాక్షులకు నోటీసులు ఇవ్వాలని జడ్జి గారు ఆదేశించినా బాధితులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కోర్టు కానిస్టేబుల్ ఉద్దేశపూర్వకంగా మోసం చేశారని పేర్కొన్నారు.ఉన్నతాధికారుల ఆదేశాలకే దిక్కులేదు.. పోలీసుల అహంకారం: ఈ వ్యవహారంలో ఇప్పటికే డీజీపీ, కలెక్టర్, పీఎంఓ, మరియు సీపీ గారి ఆదేశాలను సైతం స్థానిక ఎస్ఐ లెక్కచేయడం లేదని తెలిపారు. వరంగల్ సీపీ మేడమ్ ఈ కేసు విచారణను ప్రత్యేక విభాగానికి అప్పగించినప్పటికీ, వారు కూడా పట్టించుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున కుట్ర దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి “మీకు కావాల్సింది సాక్ష్యాలు కదా సార్” అని ప్రశ్నిస్తే.. “నీ ఆధారాలు ఎవడికి కావాలి? ఆ ఆధారాలతో మమ్మల్ని ఏం చేయలేవు.. నీకు దిక్కున్న చోట చెప్పుకో పో! ఏం చేసుకోలేవు” అని పోలీసులు బాధితులను బెదిరిస్తూ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సామాన్యుడికి ఇక న్యాయం ఎక్కడ?: “చట్టం అందరికీ సమానమే” అని చెప్పే పోలీసులే ఇలా ఆధారాలను, పెన్ డ్రైవ్‌ను దాచేస్తూ నేరస్తులకు కొమ్ముకాస్తుంటే.. ఇక ఈ సమాజంలో సామాన్య ప్రజలకు న్యాయం ఎక్కడ జరుగుతుందని బాధితులు ప్రశ్నిస్తున్నారు.వరుసగా 3 దాడులు.. అప్పుడూ ఇదే నాటకం: గతంలో 2024 నవంబర్ 13న జరిగిన దాడి కేసులోనూ విచారణ సమయానికి బాధితులకు ఎలాంటి కనీస సమాచారం ఇవ్వకుండా పోలీసులు కేసును ముగించారని, ఇప్పుడు కూడా అదే నాటకం పునరావృతం చేస్తూ నిందితులకు సహకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు బాధితులపై 3 సార్లు దాడులు జరిగినా పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం.బాధితుల తీవ్ర హెచ్చరిక --- ధర్నా, పాత్రికేయుల సమావేశానికి సిద్ధం: అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయకపోతే స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టడంతో పాటు, రాష్ట్రస్థాయి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి కేసులోని ఆధారాలన్నింటినీ ప్రసార మాధ్యమాల ముందే బహిర్గతం చేస్తామని బాధితులు హెచ్చరించారు.డిమాండ్: కేసును నీరుగారుస్తూ, బాధితులను బెదిరించే విధి నిర్వహణలో విఫలమైన ఆత్మకూర్ ఎస్ఐ తిరుపతిపై సీపీ మేడమ్ వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుని, అతడిని సస్పెండ్ చేయాలని, తమకు తక్షణమే పూర్తిస్థాయి న్యాయం చేకూర్చాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

**– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ**



# ఒకే ఇంట్లో 24 మృతదేహాలు

**మొదటి పేజీ తరువాయి...**

రసువా- 41 , తనాహున్ జిల్లా 38 చొప్పున మృతదేహాలు దొరికాయి.

**ఒకే ఇంట్లో 24 మృతదేహాలు**

వరద ప్రభావిత నువాకోట్ జిల్లాలోని బెత్రావతిలో ఒక ఇంట్లో ఇప్పటి వరకు 24 మృతదేహాలను సహాయక సిబ్బంది సోమవారం వెలికితీశారు. ఈ విషయాన్ని ఆ జిల్లా ఎస్పీ బిపిన్ రెగ్మి వెల్లడించారు. ఆ ఇంట్లో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, అది పూర్తయ్యాక మృతుల వివరాలు తెలుస్తాయని అన్నారు.

**డీఎన్ఏ టెస్టింగ్ కోసం బారులు తీరుతున్న జనం**

వరదల్లో చిక్కుకుని మరణించిన వారి మృతదేహాలను లేదా శరీర భాగాలను గుర్తించేందుకు, డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేయించుకోవాలని నేపాల్ పోలీసులు సోమవారం ప్రజలను కోరారు. విదేశాల్లో నివసిస్తున్నవారు ప్రామాణిక ల్యాబ్‌ల్లో డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేయించుకొని, దాని సాఫ్ట్ కాపీని మెయిల్ ద్వారా పంపాలని స్పష్టం చేశారు. దీనితో డీఎన్ఏ సేకరణ కేంద్రాలకు మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకొంటున్నారు.

**త్రిశూలి 3ఏ ప్లాంట్- రెస్క్యూ ఆపరేషన్**

త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్లాంట్ క్రౌన్ హెడ్‌ను సహాయక బృందాలు గుర్తించాయని ఆ దేశ హోంమంత్రిత్వశాఖ మంగళవారం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వద్ద నేపాల్ సైన్యం, సాయుధ పోలీసుల దళం, విద్యుత్ సిబ్బందితో కూడిన 90 మంది సభ్యుల బృందం గాలింపు చర్యలు చేపడుతోందని ప్రకటించింది. “జలవిద్యుత్ ప్లాంట్ క్రౌన్ హెడ్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. డ్రిల్లింగ్ చేసి 10 మీటర్ల లోతు బురద పొరను తొలగించి, ఒక ఇన్‌లెట్ ఏర్పాటు చేశారు. మరో ఇన్‌లెట్ ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయి. గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి” అని నేపాల్ హోంమంత్రిత్వశాఖ పేర్కొంది.

**మళ్లీ వరద హెచ్చరికలు**

మరోవైపు నేపాల్‌లోని అనేక జిల్లాల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి. దీనితో నేపాల్ తాజాగా మరోసారి వరద హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే త్రిశూలిని, రసువాను కలిపే రహదారి కొట్టుకుపోయింది. త్రిశూలి వైపు నీరు చాలా వేగంగా ప్రవహిస్తుండడంతో, రోడ్లు, మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనితో ఆ మార్గం అత్యంత ప్రమాదకరంగా మారిందని అధికారులు చెబుతున్నారు.



# రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

**మొదటి పేజీ తరువాయి...**

డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

# కవితకు వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్

**కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి**

**కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి**

**కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా**

హైదరాబాద్, పవర్ న్యూస్



కష్టకాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట ఉన్నది ఎవరో కవిత తెలుసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. తనపై కవిత చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కవిత చర్యల వల్ల తండ్రి కేసీఆర్ ఎంతటి మనోవేదనకు గురవుతున్నారో ఆమె ఆలోచించుకోవాలని... తాను ఎప్పుడూ కేసీఆర్-కవితలను కలపడానికే ప్రయత్నించాను తప్ప విడగొట్టడానికి కాదని స్పష్టం చేశారు. తాను, తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి 2001లో పార్టీ ఆవిర్భావానికి ముందే కేసీఆర్ వెంటే ఉన్నామని, తాము టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యులమని గుర్తుచేశారు. “బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్” అని పేర్కొన్న ఆయన... కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పార్టీ లైన్ దాటినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. అసెంబ్లీ లోపలా బయటా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిరంతరం పోరాడుతున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. తాను కాంగ్రెస్ నాయకులతో ఎలాంటి మంతనాలు జరపలేదని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ప్రమాణపూర్వకంగా చెప్పగలనని... మరి కాంగ్రెస్‌తో కవిత రహస్య మంతనాలు జరపలేదని ఆమె చెప్పగలరా? అని నిలదీశారు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తులుగా, బలంగా ఉన్న నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తూ... పార్టీని బలహీనపరిచి పరోక్షంగా అధికార కాంగ్రెస్ పార్టీకి కవిత లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. సభలో ఆమె కన్నీళ్లు పెట్టుకోవడం కేవలం రాజకీయం కోసం, సానుభూతిని పొందేందుకేనని విమర్శించారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీని చేయడంలో తన పాత్ర ఏంటో కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసని, నిన్నటి వరకు ఆమెపై ఉన్న గౌరవాన్ని తన వ్యాఖ్యలతో కవిత స్వయంగా పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇండిగో విమానం ఇంజన్‌లో సాంకేతిక లోపం

## అత్యవసరంగా గోవాలోనే ల్యాండింగ్

హైదరాబాద్, పవర్ న్యూస్ :



గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్ట్ నుంచి విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన విమానం పైలట్ వెంటనే మనోహర్ ఎయిర్ పోర్ట్ అధికారులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈ విమానాన్ని అత్యవసరంగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ విమానంలోని ప్రయాణికులను ఢిల్లీ తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో యాజమాన్యం ఈ సందర్భంగా వెల్లడించింది. అందుకోసం మరో విమానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో తెలిపింది. విమానం టేకాఫ్ అయిన ఐదు నిమిషాలకే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు కనుగొన్నారని వివరించింది. విమానంలో ఏర్పడిన సమస్యను గుర్తించే పనిలో సాంకేతిక సిబ్బంది ఉన్నారని పేర్కొంది. ప్రయాణికులతోపాటు విమాన సిబ్బందికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఇండిగో సంస్థ తెలిపింది.

# హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు భారీ ఊరట

**శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్**

**సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్**

**విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్**

హైదరాబాద్, పవర్ న్యూస్



హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా గతంలో సింగిల్ జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధమైన పాలనకు ప్రమాదకరమని, అలాంటి వ్యక్తులు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగకూడదని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఒక్క రంగనాథ్‌పైనే 63 కేసులు నమోదు కావడం అసాధారణమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగనాథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తాజాగా డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఎంతగానో దోహదపడతాయి

## ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

(మామునూరు -- పవర్):
క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు అన్నారు. మామునూరులోని 4వ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్' పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎమ్మెల్యే, జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా, మానసిక ఉల్లాసాన్ని మరియు క్రమశిక్షణను అందిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.



- పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ

# రాహుల్ గాంధీపై కేసులు ఎత్తివేసి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

## వరంగల్ డిసిసి అధ్యక్షుడు అయూబ్

వరంగల్, సెప్టెంబర్ 01(పవర్ న్యూస్ ):
ప్రజాస్వామ్య స్వరాన్ని అణచివేసే ప్రయత్నాలను సహించబోమని ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో అక్రమ కేసులు పెట్టడం సరికాదని వాటిని వెంటనే తొలగించి కాంగ్రెస్ పార్టీకి బిజెపి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వెంకట్రామ జంక్షన్ వద్ద భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ గాంధీ గారికి మద్దతుగా నినాదాలు చేస్తూ, అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజల గొంతుకగా నిలుస్తున్న రాహుల్ గాంధీ పై రాజకీయ కక్షతో కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ...రాహుల్ గాంధీ గారు ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడిపై కేసులు నమోదు చేసి ఆయన గొంతును అణచివేయాలని చూడటం సరికాదు. ప్రశ్నించే గొంతును కేసులతో అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు" అని అన్నారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా దేశ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో, ప్రజాక్షేత్రంలో బలంగా వినిపిస్తున్నారని అయూబ్ తెలిపారు. రైతులు, యువత, మహిళలు, పేదలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక కేసుల పేరుతో రాహుల్ గాంధీ గారి గొంతును నొక్కాలని చూస్తున్నారు. ఇది రాహుల్ గాంధీ గారిపై మాత్రమే జరుగుతున్న దాడి కాదు.. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడి. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతి ఒక్కరి హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంది" అని అయూబ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కును ప్రభుత్వాలు గౌరవించాలని అన్నారు. అధికారంలో ఉన్న వారు విమర్శలను స్వీకరించి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి తప్ప, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం ద్వారా



ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచకూడదని సూచించారు. రాహుల్ గాంధీ పై ఎన్ని కేసులు పెట్టినా ఆయన ఒక పతకం లెక్క భావిస్తారన్నా రు. ఆయన ప్రజా పోరాటాన్ని ఆపలేరని అయూబ్ అన్నారు. రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పోరాటం వ్యక్తుల కోసం కాదు.. ప్రజాస్వామ్యం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం. రాహుల్ గాంధీ గారి వెంట కాంగ్రెస్ పార్టీ బలంగా నిలుస్తుంది" అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు ధోరణిని విడనాడాలని, రాహుల్ గాంధీ గారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని అయూబ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించే ఏ చర్యనైనా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా ప్రతిఘటిస్తుందని, ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేర కార్పొరేషన్ చైర్మన్ సంఘ్ వెంకటరాజ్యం, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నల్లొండ రమేష్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, 3, 14, 43వ డివిజన్ల అధ్యక్షులు జన్ను అరుణకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజు కుమార్, మాజీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఎద్దు సత్యం, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల, యూత్ మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, మండల, టౌన్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు....

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా గ్రామీణ స్థాయిలో కాంగ్రెస్ బలపేతం

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి

(స్టేషన్ ఘనపూర్ -- పవర్):
కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని, రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే శ్రీ కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. జాఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాఫర్‌గఢ్ మండల, గ్రామ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమ మరియు మండల విస్తృత స్థాయి సమావేశానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
?ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. 2029 ఎన్నికలలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే ఏకైక లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా





పనిచేయాలని సూచించారు. అహంభావాలను పక్కనబెట్టి, క్రమశిక్షణతో ప్రజల కోసం పనిచేసే వారినే పార్టీ ప్రోత్సహిస్తుందని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వం మరియు సీఎం రేవంత్ రెడ్డిపై జరిగే తప్పుడు ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ?అనంతరం బిఆర్ఎస్ నిరసనలపై మండిపడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసనలు తెలిపే ముందు, కల్వకుంట్ల కవిత చేస్తున్న అవినీతి ఆరోపణలకు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన వారు ఈ రోజు సిగ్గులేకుండా నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ అధ్యక్షులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

- పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ



# ఏసీపీ జితేందర్ రెడ్డి పదవీ విరమణ వేడుకకు హాజరైన నాయిని నీలిమ రెడ్డి

(హనుమకొండ -- పవర్):
హనుమకొండ పిస్తా హౌస్ బాంక్వెట్ హాల్‌లో నిర్వహించిన ఏసీపీ జితేందర్ రెడ్డి గారి పదవీ విరమణ వేడుకకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి సతీమణి శ్రీమతి నాయిని నీలిమ రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ జితేందర్ రెడ్డి గారిని కలిసి శాలువాతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. విధి నిర్వహణలో ఆయన అందించిన సేవలను అభినందిస్తూ, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో శేష జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు మరియు సన్నిహితులు పాల్గొన్నారు.

- పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ

# అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

(హన్మకొండ -- పవర్):



రాష్ట్రంలో ప్రతి అర్హుడికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం ఎర్రగట్టుగుట్ట వద్దగల మీ= గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 65, 66, 1, 2, 55 డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను వరంగల్ ఎంపీ కడియం కావ్య గారితో కలిసి ఆయన పంపిణీ చేశారు.
?ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

- పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ 14 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి: ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్

(హనుమకొండ -- పవర్):



రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ. 14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ (ఐ) మమత గారికి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా నాయకులు మైదం రవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని స్పష్టం చేశారు. కోర్సులు పూర్తయి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాల యాజమాన్యాలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బకాయిల విడుదలలో తీవ్ర ఆలస్యం కావడం వల్ల పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగి మధ్యలోనే ఆగిపోతున్నాయని, మనస్తాపంతో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు నిరుపేద విద్యార్థులు తీవ్ర దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా నాయకులు ఎస్.కె. సలీం పాషా, ఆత్మకూరు మండల అధ్యక్షుడు బాగజీ రజినీకాంత్, మండల నాయకులు రాదరపు రాజు, మాదాసి జస్వంత్, ఎస్.కె. కమల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ





# ఘనంగా పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు

(పరకాల -- పవర్):

పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారి జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అత్యంత వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, డివిజన్ల పరిధిలో సంబరాలు అంబరాన్నంటాయి. ?ఈ వేడుకల్లో భాగంగా పరకాల యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీ మాదాసి శ్రీధర్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు, బాటసారులకు అన్నప్రసాద వితరణ చేశారు.అంతకుముందు వివిధ దేవాలయాల్లో ఎమ్మెల్యే గారి పేరిట ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, ఆయన ఎల్లవేళలా పరిపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థించారు. నియోజకవర్గవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ బైక్ ర్యాలీలు, కేక్ కటింగ్ వేడుకలు నిర్వహించి ఎమ్మెల్యే గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.రాబోయే రోజుల్లో కూడా ఆయన ప్రజాసేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని, పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

- పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ

## రాజకీయ కక్షతోనే రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్

**వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ పసునూరి భాస్కర్**



వరంగల్, సెప్టెంబర్ 01( పవర్ న్యూస్ ):

దళితుల పట్ల వివక్ష అంటరానితనానికి వ్యతిరేకంగా గళం విప్పిన రాహుల్ గాంధీ పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బిజెపి కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ పసునూరి భాస్కర్ మండిపడ్డారు. మల్లికార్జున ఖర్గే ఎదుర్కొన్న అవమానకర పరిస్థితుల గురించి ప్రశ్నించినందుకు రాహుల్ పై కేసు నమోదు చేయడం దురదృష్టకరమన్నారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం ప్రశ్నించిన వారిని నిందితులుగా చిత్రీకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ధ్వజమెత్తారు. దళితుల పట్ల వివక్షను నిర్మూలించేందుకు కేంద్రం తీసుకున్న నిర్దిష్ట చర్యలు ఏమిటో దేశ ప్రజలకు చెప్పాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## భర్త వేధింపులు తాళలేక ఉరివేసుకుని భార్య ఆత్మహత్య

**వరకట్న వేధింపుల కేసు నమోదు: ఆత్మకూరు ఎస్సై పి. తిరుపతి**

(గుడెపాడ్ -- పవర్): వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న తీవ్ర విషాద సంఘటన ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడెపాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. ఘటనపై వివరాలను ఆత్మకూరు ఎస్సై పి. తిరుపతి వెల్లడించారు.?పోలీసుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామానికి చెందిన బుర్రా చందర్ తన సోదరి చల్లా అఖిల (24)ను 04 డిసెంబర్ 2022న ఆత్మకూరు మండలం గుడెపాడ్ గ్రామానికి చెందిన చల్లా ప్రవీణ్ రెడ్డికి ఇచ్చి వివాహం జరిపించారు. వివాహమైన రెండేళ్ల వరకు వీరి కాపురం ప్రశాంతంగానే సాగింది. వీరికి అధిక్ రెడ్డి అనే కుమారుడు ఉన్నాడు.?ఆ తర్వాత భర్త ప్రవీణ్ రెడ్డి అదనపు కట్నం కింద రూ. 50,000 తీసుకురావాలని అఖిలను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడని, పలుమార్లు ఆమెతో గొడవపడ్డాడని ఎస్సై తెలిపారు. ఈ క్రమంలోనే 31 ఆగస్టు 2026న ప్రవీణ్ రెడ్డి మరోసారి అదనపు కట్నం కోసం అఖిలతో తీవ్రంగా గొడవపడ్డాడు. భర్త వేధింపులు భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన అఖిల, మరుసటి రోజు మంగళవారం ఉదయం గుడెపాడ్‌లోని తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.?మృతురాలి సోదరుడు బుర్రా చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు క్రైమ్ నంబర్ 170/2026 కింద సెక్షన్లు 85, 80 మరియు వరకట్న నిషేధ చట్టం సెక్షన్లు 3, 4 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

# పేదల సామాజిక గౌరవానికి ప్రతీక నూతన రేషన్ కార్డు





**పేదల ఆర్థిక భారాన్ని తగ్గించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం.**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**

ములుగు, పవర్ న్యూస్:

పేదల సామాజిక గౌరవానికి నూతన రేషన్ కార్డు ప్రతీకగా నిలుస్తుందని, సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

మంగళవారం ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ములుగు, మల్లంపల్లి మండలాల లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ములుగు మండలానికి 1,809, మల్లంపల్లి మండలానికి 621 చొప్పున మొత్తం 2,430 నూతన రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, రేషన్ కార్డులు లేని కారణంగా అర్హులైన పేదలు సన్నబియ్యం పథకానికి దూరం కావద్దనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం నూతన కార్డులను మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ సంవత్సరంలో 12,802 నూతన రేషన్ కార్డుల ద్వారా 36,405 మంది కుటుంబ సభ్యులకు సన్నబియ్యం పథకం ప్రయోజనాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 15 లక్షలకు పైగా నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు వివరించారు.మార్కెట్‌లో సన్నబియ్యం కొనుగోలు చేయడం పేద కుటుంబాలకు భారంగా మారిందని, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడంతో ఆ కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతోందని అన్నారు.గతంలో పెద్ద పరిమాణంలో ఉండే రేషన్ కార్డులను తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం జేబులో సులభంగా తీసుకెళ్లగలిగేలా స్మార్ట్ కార్డులను రూపొందించి అందిస్తున్నామని తెలిపారు. రేషన్ సరుకులు పొందడానికే కాకుండా వివిధ ధ్రువపత్రాల జారీ, ఆరోగ్యశ్రీ తదితర అవసరాలకు కూడా రేషన్ కార్డు ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన పేదలకు ప్రాధాన్యమిస్తూ నూతన కార్డులను అందిస్తున్నామని, ఇంకా కార్డులు అందని అర్హులకు రానున్న రోజుల్లో అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మారుమూల ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పింఛన్ల దరఖాస్తుల గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 4 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తిస్తామని తెలిపారు.

అర్హులైన వారు తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు లేదా మీ సేవా కేంద్రాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అర్హులకు దరఖాస్తు ప్రక్రియలో సహకరించాలని కోరారు.

ములుగు నియోజకవర్గానికి ఇప్పటివరకు 5 వేలకు పైగా ఇండ్లను లబ్ధిదారులకు అందించామని, ఇంకా అనేక పేద కుటుంబాలకు ఇండ్ల అవసరం ఉందని తెలిపారు. సర్వేలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలు ములుగులో అధికంగా ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. రెండో విడతలో అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గుడిసెల్లో నివసించే అర్హులైన కుటుంబాల వివరాలతో జాబితాలను ఖరారు చేసి పంపించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు సిమెంట్ ధరల నియంత్రణపై ప్రభుత్వం పలు సిమెంట్ కంపెనీలతో చర్చలు జరుపుతోందని తెలిపారు.

సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల ద్వారా పేదలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ములుగు మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిర్మల చంద్రకళ, డీసీఎస్ఓ ఫైజల్ హుస్సేని, డీఎం కృష్ణవేణి, తహసీల్దార్లు, నూతన రేషన్ కార్డుల లబ్ధిదారులు, రేషన్ డీలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరాధార ఆరోపణలను తిప్పిగొట్టిన జిల్లా నాయకత్వం

**రాష్ట్రంలో విజయవంతంగా సాగుతున్న వెయ్యి రోజుల ప్రజా పాలన**

**తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కి పెంపు.. దేశ సగటు కంటే 91 శాతం అధికం**

**హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

**ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



(హనుమకొండ -- పవర్):

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనను అత్యంత విజయవంతంగా పూర్తి చేసుకుందని, సంక్షేమం, వృద్ధిరేటులో రాష్ట్రం దూసుకుపోతుంటే ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రెస్ మీట్‌కు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.సమావేశంలో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాని అస్తవ్యస్తం చేస్తే, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి సంక్షేమానికి, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పి కొడుతూ ప్రభుత్వ వాస్తవ ప్రగతి గణాంకాలను ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ తలసరి ఆదాయం ఏకంగా రూ.4,18,931కి చేరిందని, ఇది దేశ సగటు తలసరి ఆదాయంతో పోలిస్తే దాదాపు 91 శాతం అధికం కావడం ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఇచ్చిన మాట ప్రకారం 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పంట రుణాలు విజయవంతంగా మాఫీ చేశామని గుర్తు చేశారు. రైతు భరోసా పథకం కింద రైతులకు రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయాన్ని అందిస్తూ, ఇప్పటివరకు రైతాంగ సంక్షేమం కోసమే ప్రభుత్వం రూ.1.68 లక్షల కోట్లు ఖర్చు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని వివరించారు.ఎంపీ డా. కడియం కావ్య మరియు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే హనుమండ్ల యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి లాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తూ, సోషల్ మీడియాలో బురదజల్లుతున్న బీఆర్ఎస్ నేతలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

- పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ





# హెబ్బా హొయలు

## నేవీ బ్లూలో మెస్మరైజ్!

'కుమారి 21ఎఫ్' సినిమాతో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ హెబ్బా పటేల్.. తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలతో సందడి చేస్తోంది. నేవీ బ్లూ డ్రెస్‌లో బోల్డ్ అండ్ క్లాసీ లుక్‌తో మెస్మరైజ్ చేసింది. తాజా ఫొటోషూట్ కోసం హెబ్బా పటేల్ ఆల్-బ్లూ థీమ్‌ను ఎంచుకుంది. 'హౌస్ ఆఫ్ శ్లోక్' డిజైన్ చేసిన మిడ్‌నైట్ నేవీ బ్లూ వన్-షోల్డర్ క్రాప్ టాప్, మ్యాచింగ్ డ్రేప్డ్ స్కర్ట్‌లో ఆకట్టుకుంది. భుజం నుంచి కిందకు జారే జార్జెట్ డ్రేప్ డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాయల్ బ్లూ డ్రెస్‌కు సరిపోయేలా మెరిసే ఇయర్ రింగ్స్, బ్రాస్‌లెట్స్‌తో హెబ్బా తన లుక్‌ను మరింత గ్లామరస్‌గా మార్చుకుంది. నీట్‌గా వెనక్కి తీసిన హెయిర్, ఆకట్టుకునే మేకప్‌తో ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. 'ఓన్లీ బ్లూస్!' అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్‌తో ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# జాన్వీ కపూర్.. వైరల్ పిక్స్

అలనాటి అతిలోక సుందరి శ్రీదేవి తనయగా 'ధడక్' సినిమాతో వెండితెరకు పరిచయమైన జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల టాలీవుడ్‌లో ఎన్టీఆర్ సరసన 'దేవర', రామ్‌చరణ్ సరసన 'పెద్ది' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించింది. తాజాగా ఆమె షేర్ చేసిన గ్లామరస్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒక ఫొటోలో చిన్న చిన్న రెడ్ చెర్రీ డిజైన్లతో ఉన్న క్రీమ్ కలర్ నిట్ మినీ డ్రెస్‌లో సిటీ క్రాస్‌వాక్‌పై నడుస్తూ లిప్‌స్టిక్ వేసుకుంటూ కనిపించింది. మరో లుక్‌లో పింక్ స్లీవ్‌లెస్ వినెక్ కార్సెట్ టాప్, బ్లూ డెనిమ్స్, బ్లూ హ్యాండ్‌బ్యాగ్‌తో అల్ట్రా మోడర్న్‌గా దర్శనమిచ్చింది. క్యూట్ అండ్ స్టైలిష్ లుక్స్‌తో జాన్వీ ఆకట్టుకోగా.. ఆమె ఫొటోలకు నెటిజన్ల నుంచి లైకులు, కామెంట్ల వర్షం కురుస్తోంది.



# అది నేను కాదు

## డీప్‌ఫేక్‌పై శాలిని క్లారిటీ

'అర్జున్‌రెడ్డి' ఫేమ్ శాలిని పాండే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నడీప్ ఫేక్ వీడియోపై స్పందించారు. అందులో కనిపిస్తున్నది తాను కాదని, అది పూర్తిగా ఏఐ సాంకేతికతతో రూపొందించిన డీప్‌ఫేక్ వీడియో అని స్పష్టం చేశారు. కొంతకాలంగా ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో శాలిని తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. తనను లక్ష్యంగా చేసుకుని నకిలీ కంటెంట్ రూపొందించడం బాధాకరమని, ముఖ్యంగా మహిళలను ఇలాంటి ఫేక్ వీడియోలతో వేధించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇలాంటి వీడియోలను చూసిన వారు షేర్, ఫార్వర్డ్ లేదా డౌన్‌లోడ్ చేయవద్దని శాలిని విజ్ఞప్తి చేశారు. కామెంట్లు, రియాక్షన్ల ద్వారా వాటికి మరింత ప్రచారం కల్పించకుండా వెంటనే రిపోర్ట్ చేయాలని సూచించారు. ఏఐ సాంకేతికతను దుర్వినియో గం చేసి వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ప్రోత్సహించవద్దని ఆమె కోరారు.

# హలో సెప్టెంబర్ నేహా శర్మ గ్లామర్ ట్రీట్

అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే నేహా శర్మ.. తాజాగా సెప్టెంబర్ నెలకు స్వాగతం పలుకుతూ కొన్ని గ్లామరస్ ఫొటోలను ఇన్‌స్టాగ్రామలో షేర్ చేసింది. వెకేషన్‌లో ఉన్నట్లు కనిపిస్తున్న నేహా.. రిసార్ట్ స్విమ్మింగ్ పూల్ వద్ద సెల్ఫీ ఫోజులతో సందడి చేసింది. గ్రీన్, ఐవరీ కలర్ చెక్స్ డిజైన్ ఉన్న మినీ షార్ట్‌లో స్టైలిష్‌గా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. ఆమె షేర్ చేసిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. "హలో సెప్టెంబర్.. నన్ను మరింత ఆశ్చర్యపరచు" అంటూ నేహా పెట్టిన క్యాప్షన్ కూడా నెటిజన్లను ఆకట్టుకుంటోంది. లైకులు, కామెంట్లతో అభిమానులు సందడి చేస్తున్నారు.



# వరుస హిట్లు.. రూ.4 కోట్ల రేంజ్!

## మమితా బైజు.. టాప్ రెమ్యునరేషన్!

మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు వరుస విజయాలతో సౌత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో క్రేజ్ సంపాదించుకుంది. దాదాపు పదేళ్లుగా నటిగా కొనసాగుతున్న ఆమెకు ఇటీవల వరుసగా మంచి అవకాశాలు వస్తున్నాయి. 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో ఆమెకు మరింత గుర్తింపు లభించినట్లు తెలుస్తోంది. 2026లో మమిత నటించిన నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాగా.. ఆమె నటనకు మంచి స్పందన లభించింది. స్టార్ హీరో విజయ్‌తో కలిసి నటించిన 'జన నాయగన్' కూడా ఆమె కెరీర్‌లో కీలక చిత్రంగా నిలిచింది. ఇక పారితోషికం విషయంలోనూ మమితా బైజు రేంజ్ పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది. ఇటీవల వరకు ఒక్కో సినిమాకు సుమారు రూ.2 కోట్లు తీసుకున్న ఆమె.. 'విశ్వనాథ్ అండ్ సన్స్' విజయం తర్వాత రూ.3 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. తాజాగా టాలీవుడ్‌లో ఓ స్టార్ హీరో సరసన నటించే అవకాశం కోసం సంప్రదించగా.. ఏకంగా రూ.4 కోట్ల పారితోషికం డిమాండ్ చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇందుకు మేకర్స్ కూడా అంగీకరించినట్లు సమాచారం.

